క్లుప్తంగా

సివిల్స్ ర్యాంకర్ శ్రీసాయి అశ్రిత్‌కు అభినందన




అశ్రిత్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న శేషు, శివ | అభినందిస్తున్న ఈవీ.శ్రీనివాస్‌రావు

హన్మకొండ: సివిల్స్‌లో 40వ ర్యాంకు సాధించిన శాకమూరి శ్రీసాయి అశ్రిత్‌ను ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు సన్మానించారు. హనుమకొండ అడ్వకేట్స్ కాలనీలోని స్వగృహంలో అశ్రిత్‌ను అధ్యాపకుడు శివతో కలిసి తిరునహరి శేషు సోమవారం కలిసి అభినందించారు.

హన్మకొండ అర్బన్: ఇటీవల విడుదలైన సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో ఆల్ ఇండియా 40వ ర్యాంకు సాధించిన నగరానికి చెందిన శాకమూరి సాయి అశ్రిత్‌ను రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు ఈవీ.శ్రీనివాస్‌రావు సోమవారం కలిసి అభినందించారు. కార్యక్రమంలో సాయి అశ్రిత్ తండ్రి శాకమూరి అమర్, తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

కాజీపేట: అధిక లాభాల ఆశతో నాణ్యత లేని విత్తనాలను విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందితే సదరు దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి దొండపాటి శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. కాజీపేట పట్టణంలో విత్తన విక్రయ కేంద్రాల్లో పోలీసులతో కలిసి సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాసిరకం విత్తనాలను విక్రయిస్తే దుకాణాలను జప్తు చేస్తామని, అధిక ధరలకు విక్రయాలు చేయవద్దని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను దుకాణదారులు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.

మల్లన్న ఆలయంలో అఘోర పాశుపత జపాలు

కాజీపేట: కాజీపేట పట్టణంలోని భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో అఘోర పాశుపత జపాలు సోమవారం ముగిశాయి. పూజల్లో భాగంగా స్వామి వారిని పలు రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు ఐనవోలు ప్రవీణ్‌కుమార్‌శర్మ మాట్లాడుతూ సోమవారం స్వామివారికి విశిష్టమైన దినం కావడంతో భక్తులందరికి ప్రత్యేక దర్శనం కల్పించామని, అభిషేకాలు నిర్వహించామని తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో పాటు శివ – శక్తి యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


మార్కెట్‌లో రైతులకు మజ్జిగ పంపిణీ



రైతులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న రమేష్

వరంగల్: ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో రైతులు, సిబ్బంది, కార్మికులకు మన అగ్రిటెక్ ఆధ్వర్యంలో సంస్థ ఎండీ పాశికంటి రమేష్ సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత వల్ల ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో రైతులకు ఉపశమనం కోసం మజ్జిగ పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు, మార్కెట్ సిబ్బంది, మన అగ్రిటెక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అతిథి దివ్యాంగుల ఆశ్రమంలో అన్నదానం



హన్మకొండ కల్చరల్: అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ రెడ్డి కాలనీలో అతిథి దివ్యాంగుల ఆశ్రమంలో అయ్యప్ప స్వామి పడిపూజ, అన్నదానం కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. వాగ్దేవి సరస్వతి ఆలయం అర్చకుడు శరత్‌శర్మ, ధర్మ ప్రచారసభ ఉభయ తెలుగు రాష్ట్రాల కన్వీనర్, ట్రస్ట్ సభ్యుడు రాజర్ల రమేష్, స్టేట్ జాయింట్ సెక్రటరీ వీరస్వామి గౌడ్, జిల్లా అధ్యక్షుడు భయాన సంతోష్, సెక్రటరీ పెరుమాండ్ల శ్రీనివాస్‌గౌడ్, దూశెట్టి భాస్కర్, జితేందర్‌స్వామి, రమాకాంత్‌రెడ్డి, బాలరాజ్, వెంకన్న, సాగర్, బాలాజీ, అజయ్, రాజ్‌కుమార్, ఆశ్రమ ఇన్‌చార్జ్ సుజాత, రత్నం పాల్గొన్నారు.

అర్చక ఫెడరేషన్ సమావేశం

హన్మకొండ కల్చరల్ : ఆల్ ఇండియా అర్చక ఫెడరేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలో ఆల్ ఇండియా అర్చక ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బండారి శేషగిరిరావు (భద్రకాళి శేషు) అధ్యక్షతన సోమవారం సమావేశం జరిగింది. ఈమేరకు పలు రాష్ట్రాల అర్చక ఫెడరేషన్ సభ్యులు పాల్గొని బ్రాహ్మణ సంక్షేమ పథకాల గురించి చర్చించారు.

సమాజ సేవలో 'లోడి' సంస్థ

- ఇప్పటి వరకు 165 గ్రామాల్లోని చెరువుల్లో పూడికతీత
- 45 చెక్‌డ్యామ్‌ల నిర్మాణం
- హెచ్‌ఐవీ పాజిటివ్, రైతులు, దివ్యాంగులు, మహిళలకు చేయూత
- 'కోవిడ్'లో నిత్యావసరాల పంపిణీ
- నేడు సంస్థ డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి ఆత్మీయ వీడ్కోలు సమావేశం
- జనగామలోని క్రీస్తు జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలకు డైరెక్టర్‌గా బదిలీ

కాజీపేట రూరల్: ఇటలీ దేశంలో లోడి అనేది ఒక చిన్న టౌన్ పేరు. మాధవ సేవయే మానవ సేవ అని నమ్ముతూ పేదల అభివృద్ధికి ఫాదర్ కొలంబో సంకల్పించారు. ఈక్రమంలో ఇటలీ దేశం నుంచి ఇండియాకు వచ్చి తొలుత ఖమ్మంలో పేద ప్రజలకు సేవలందించేందుకు లోడి సాంఘిక సేవా సంస్థను నెలకొల్పారు. నాటి నుంచి నేటి వరకు ఫాదర్ కొలంబో లేకున్నా ఆయన సేవలు, ఆశయాలను ఫాతిమానగర్‌లోని లోడి సంస్థ కొనసాగిస్తోంది. ఇప్పటివరకు సంస్థ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన విజయపాల్ రెడ్డి ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించనున్నారు. ఆయన జనగామలోని క్రీస్తు జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలకు డైరెక్టర్‌గా బదిలీ వెళ్లనున్నారు.



కోవిడ్ సమయంలో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఉడుముల బాల, విజయపాల్‌రెడ్డి

అభివృద్ధి, ఆరోగ్యం, ఆనందమే లక్ష్యంగా ..

కాజీపేట ఫాతిమానగర్‌లోని లోడి స్వచ్ఛంద సాంఘిక సేవా సంస్థ (లోడి మల్టీపర్పస్ సోషల్ సర్వీస్ సొసైటీ) సమాజ సేవలో తరిస్తూ హెచ్‌ఐవీ పాజిటివ్ పిల్లల పరిరక్షణ, రైతులు, మహిళలకు అండగా ఉంటూ సేవలందిస్తోంది. 1966లో ఖమ్మం కేంద్రంగా లోడి సంస్థను ఫాదర్ కొలంబో స్థాపించి సేవలు ప్రారంభించారు. అనంతరం కాజీపేట ఫాతిమానగర్ కేంద్రంగా 1988లో లోడి సేవా సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించి పేదల అభివృద్ధి, ఆరోగ్యం, ఆనందమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. లోడి సంస్థ అధ్యక్షుడు, ఓరుగల్లు మేత్రాసనం పీఠాధిపతి డాక్టర్ బిషప్ ఉడుముల బాల నేతృత్వంలో లోడి సంస్థ సేవా, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తోంది. లోడి సంస్థ ఇప్పటి వరకు అనేక గ్రామాల్లో 165 చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టి, 45 చెక్‌డ్యామ్‌లను నిర్మించింది. సుస్థిర వ్యవసాయం, పేద రైతులకు కూరగాయల విత్తనాలు, చిరుధాన్యాల పంపిణీ, 60 గ్రామాల్లో కోళ్ల పెంపకం వంటివి చేపడుతూ వారి ఆర్థికాభివృద్ధికి పాటు పడుతోంది. హెచ్‌ఐవీ పాజిటివ్ కుటుంబాలకు న్యూట్రిషన్ ఫుడ్ పంపిణీ చేస్తూ, దివ్యాంగులకు పౌష్టికాహారం అందిస్తోంది. పేద పిల్లల చదువులకు కావాల్సిన పుస్తకాలను అందిస్తూ వారి విద్యాభివృద్ధికి తోడ్పడుతోంది. కోవిడ్ సమయంలో బాధితులను ఆదుకొని వారికి బాసటగా నిలిచింది. మహిళా సహకార సంఘాలు ఏర్పాటు చేసి 3,800 మంది సభ్యులకు సహాయ సహకారం అందించింది.

నిరుపేదల అభివృద్ధే సంస్థ లక్ష్యం



నిరుపేదల అభివృద్ధే లోడి సేవా సంస్థ ధ్యేయం. డైరెక్టర్‌గా తాను 2015 నుంచి 2023 వరకు తెలంగాణలో 11 జిల్లాలో లోడి సేవలు అమలు చేస్తూ అనేక మందికి అండగా నిలిచాం. రైతుల అభివృద్ధి, మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేశాం. కోవిడ్ సమయంలో 15 వేల మందికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేసి ఆదుకున్నాం. అందరి సహకారంతో డైరెక్టర్‌గా నా బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించాను.

– ఫాదర్ డి.విజయపాల్‌రెడ్డి, లోడి సేవా సంస్థ డైరెక్టర్, కాజీపేట

'కార్మిక సభ'ను విజయవంతం చేయాలి



ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న చీఫ్‌విప్, కార్మిక నాయకులు

హన్మకొండ: ఈనెల 31న జరగనున్న కార్మిక యుద్ధ భేరి సభను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. కార్మిక యుద్ధభేరి సభ నిర్వహించనున్న హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియం ఆవరణను కార్మిక సంఘాల నాయకులతో కలిసి వినయ్‌భాస్కర్ సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో కార్మిక సంక్షేమ మాసోత్సవ కోఆర్డినేటర్ పుల్ల శ్రీనివాస్, టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ.జాన్సన్, కార్మిక సంఘాల నాయకుడు కేశోజు ప్రణయ్ పాల్గొన్నారు.

ఆటో కార్మికుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

కాజీపేట రూరల్: ఆటో కార్మికుల అభివృద్ధి, సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం ఆవరణంలో ఈనెల 31న జరగనున్న కార్మిక యుద్ధభేరి బహిరంగ సభ కరపత్రాలను కాజీపేట జంక్షన్‌లోని ప్రతాపరుద్ర ఆటో యూనియన్ స్టాండ్ వద్ద సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రతాపరుద్ర ఆటో యూనియన్ అధ్యక్షుడు గడ్డం నర హరి, ప్రధాన కార్యదర్శి నాతి సత్యనారాయణ, కోశాధికారి భుక్యా శంకర్‌నాయక్, బొక్క స్వామి, ఎండి.నజీర్, పాలడుగుల రవి, సుధాకర్, కార్పొరేటర్ సంకు నర్సింగరావు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. అలాగే, ఆటో డ్రైవర్లకు ప్రతి సంవత్సరం రూ.50 వేలతో ఇన్సూరెన్స్ పాలసీతో పాటు నిరుపేద ఆటో డ్రైవర్లకు డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి కృషి చేస్తానని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట బాపూజీనగర్ కడిపికొండ బ్రిడ్జి వద్ద గల ట్రెసిటీ ఆటో యూనియన్ వద్ద కార్మిక యుద్ధభేరి పోస్టర్లనును వినయ్‌భాస్కర్ ఆవిష్కరించి మాట్లాడారు.

ఎస్సీ వర్గీకరణకు ఉమ్మడి పోరాటం



కాశిబుగ్గ: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

హసన్‌పర్తి: ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతకు ఉమ్మడి పోరాటాలు చేయాలని ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జ్ మంద రాజు పిలుపునిచ్చారు. జూన్ 4న నగరంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించనున్న మాదిగ మహాసభ కరపత్రాలను హసన్‌పర్తి మండలం దేవన్నపేటలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధించేందుకు 'టార్గెట్ 50 డేస్' కార్యాచరణతో ముందుకు సాగుతామని వివరించారు. ఎమ్మార్పీఎస్ దేవన్నపేట శాఖ అధ్యక్షుడు అరవింద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ యువజన విభాగం రాష్ట్ర మాజీ కన్వీనర్ పుట్ట భిక్షపతి, ఎంఎస్‌పీ హనుమకొండ జిల్లా కో కన్వీనర్ రాజారపు భిక్షపతి, నాయకులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి

కాశిబుగ్గ: ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో హనుమకొండలో చేపట్టబోయే ఉమ్మడి వరంగల్ జిల్లా మహాసభ(చలో హనుమకొండ)ను విజయవంతం చేయాలని ఎంఎస్పీ నాయకుడు మంద కుమార్ పిలుపునిచ్చారు. ఈమేరకు కాశిబుగ్గ జంక్షన్‌లో సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కుమార్, మహేందర్, రాజశేఖర్, మధుకర్, సుధాకర్, రవిందర్, రాజు, చిన్న పాల్గొన్నారు.

యోగా.. జీవితంలో భాగం కావాలి

- 58వ బీఎన్ సీఆర్‌పీఎఫ్ డీసీ సుమ



యోగా సాధన చేస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది

హన్మకొండ: యోగాను దైనందిన జీవితంలో ఒక భాగం చేసుకోవాలని 58వ బీఎన్ సీఆర్‌పీఎఫ్ డీసీ సుమ సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్ యోగా శిబిరం ఆధ్వర్యంలో సోమవారం హరిత కాకతీయ హోటల్‌లో సీఆర్‌పీఎఫ్ జవాన్లకు యోగా శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా యోగా ప్రాధాన్యతను యోగా గురువు పోశాల శ్రీనివాస్ వివరిస్తూ ఆసనాలు, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు నేర్పించారు. అనంతరం సీఆర్‌పీఎఫ్ డీసీ సుమ మాట్లాడుతూ యోగా ద్వారా దీర్ఘకాలిక రోగాలు నయం అవుతాయని వివరించారు. నిత్యం ఆసనాలు వేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డీసీ తులసి, యోగా సాధకులు హిమ, రవీంద్రచారి, హరి, మంజుల రెడ్డి, కౌసల్య, అమరావతి, సీఆర్‌పీఎఫ్ జవాన్లు, యోగా సాధకులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో కృష్ణమూర్తికి బంగారు పతకం



బంగారు పతకం చూపుతున్న కృష్ణమూర్తి

కాజీపేట: హైదరాబాద్ పోస్టల్ కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 27, 28వ తేదీల్లో జరిగిన తెలంగాణ రాష్ట్ర మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ పోటీల్లో కాజీపేట పట్టణానికి చెందిన మండలోజు కృష్ణమూర్తి ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించారు. 65ఏళ్ల వయస్సులో 81 కిలోల క్యాటగిరీలో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించారు. ఆయన ప్రస్తుతం హనుమకొండ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. రైల్వేలో సీనియర్ లోకో పైలట్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన కృష్ణమూర్తిని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం బాధ్యులు కాజీపేటలో సోమవారం సన్మానించారు.

దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న సంఘం నాయకుడు

కాశిబుగ్గ: జనాభా దామాషా ప్రకారం బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించి, సీట్లు కేటాయించాలని తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయకుమార్ డిమాండ్ చేశారు. కాశిబుగ్గలో సంఘం జిల్లా అధ్యక్షుడు బేతి రాజు అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓటర్లుగానే వాడుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వారి అభివృద్ధికి ఎవరూ కృషి చేయడం లేదని విమర్శించారు. జూన్ 25న కాశిబుగ్గ కేవీఎస్ ఫంక్షన్ హాల్‌లో జరగనున్న బీసీల తూర్పు నియోజకవర్గ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం నాయకులు బక్కం రాంమోహన్, పైడిపాల వెంకటేశ్వర్లు, శేఖర్, క్రాంతికుమార్, సదానందం, బ్రహ్మాచారి, శ్రీకాంత్, అనుదీప్, నవీన్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి జిల్లా కన్వీనర్‌గా స్టాలిన్‌బేగ్



విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) కుటుంబ సంక్షేమ నిధి పథకం హనుమకొండ జిల్లా కన్వీనర్‌గా ఎండీ.స్టాలిన్‌బేగ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్ వెల్లడించారు. ఈమేరకు హనుమకొండలోని జిల్లా టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ప్రకటించారు. సమావేశంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సదాశివరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు, తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి చెరువును కబ్జా నుంచి కాపాడండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మణ్

వరంగల్ అర్బన్: నగరంలోని భద్రకాళి చెరువు ఆక్రమణలతో రోజురోజుకు కుదించుకుపోతోందని, వాస్తవ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను గుర్తించి అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆక్రమణ ప్రాంతాల పరిరక్షణ సొసైటీ నాయకులు కోరారు. ఈమేరకు గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను బల్దియా ప్రధాన కార్యాలయంలో సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. చెరువు శిఖం సుమారు 50ఎకరాల వరకు కబ్జాకు గురైందని సొసైటీ అధ్యక్షుడు పెరుమాండ్ల లక్ష్మణ్ పేర్కొన్నారు. గతంలో బల్దియా, 'కుడా' ఇరిగేషన్ అధికారులు కలిసి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను గుర్తించి దిమ్మెలు పాతారని, అయితే వాటిని కొంతమంది కబ్జాదారులు తొలగించి, భవన నిర్మాణాలు చేపట్టారని తెలిపారు.

ఉచిత విద్య, వైద్యం, ఉపాధికి పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న భరత్

నయీంనగర్: ప్రజలకు ఉచిత విద్య, వైద్యం, ఉపాధిని ప్రభుత్వం కల్పించాలని, వాటి సాధనే లక్ష్యంగా జన పోరాట సమితి పోరాటం చేస్తోందని వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు భరత్ అన్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో భరత్ మాట్లాడుతూ జన జీవన స్రవంతిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మన ఊరు – మన బడి కార్యక్రమాన్ని మొక్కుబడిగా కాకుండా సర్కారు పాఠశాలలపై ప్రజలకు నమ్మకం, విశ్వాసం కలిగేలా అమలు చేయాలని సూచించారు. కొఠారి కమిషన్‌ను అమలు చేస్తూ నాణ్యమైన కేజీ టు పీజీ ఉచిత నిర్బంధ విద్యను అందించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగం, ఉపాధి కల్పించాలని, ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు దేవి సాంబరాజు, పరమేశ్వర్, రవీందర్, ఐలయ్య, కోల ప్రవీణ్, పున్నం చందర్ పాల్గొన్నారు.

కాజీపేట జంక్షన్‌లో గుర్తు తెలియని వృద్ధుడి మృతి



వృద్ధుడు (ఫైల్)

కాజీపేట రూరల్: గుర్తు తెలియని సుమారు 70 ఏళ్ల వయస్సు గల వృద్ధుడు కాజీపేట జంక్షన్‌లో ఆదివారం రాత్రి మృతి చెందాడు. కాజీపేట జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ కె.దయాసాగర్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం కాజీపేట రైల్వే రూట్ రిలే ఇంటర్ లాకింగ్ సిస్టం కార్యాలయం ఎదురుగా వరంగల్ వైపు మార్గంలో వృద్ధుడు మృతి చెంది కనిపించాడు. అనారోగ్యం లేదా ఎండదెబ్బకు గురై మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అతని మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి వివరాలకు జీఆర్పీ పోలీస్‌స్టేషన్ లేదా 98663 30257, 94932 01968 నంబర్లలో సంప్రదించాలని దయాసాగర్ కోరారు.

వేతనాలు పెంచాలని వీసీకి వినతి



వీసీకి విన్నవిస్తున్న సీఐటీయూ నాయకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో దినసరి వేతన, లంప్సమ్, క్యాజువల్ తాత్కాలిక ఉద్యోగుల వేతనాలు పెంచాలని సీఐటీయూ రాష్ట్ర బాధ్యులు మెట్టు రవి, కచ్చకాయల చిరంజీవి కోరారు. ఈమేరకు క్యాంపస్‌లో వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్‌కు సోమవారం విజ్ఞప్తి చేశారు. అలాగే, కాకతీయ యూనివర్సిటీలో న్యాక్ పీర్‌టీం పర్యటన విజయవంతంగా ముగిసినందుకు వీసీకి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి దేశిని రవికుమార్, బాధ్యులు మొగిలి రాజేందర్, సంగాల రాజు, శ్రీనివాస్, మధు, నహీం, శోభ, కృష్ణ పాల్గొన్నారు.

1న రెడ్డి కులస్తుల ఆత్మీయ సమ్మేళనం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, రెడ్డి జేఏసీ నాయకులు

హన్మకొండ: రెడ్డి ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని రెడ్డి జేఏసీ కన్వీనర్ గోపు జయపాల్ రెడ్డి, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండ నక్కలగుట్టలోని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి స్వగృహంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో రెడ్డి ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయపాల్ రెడ్డి, యాదవరెడ్డి మాట్లాడుతూ జూన్ 1న సాయంత్రం మడికొండలోని రెడ్డి కన్వెన్షన్‌లో రెడ్డి ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందని, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రెడ్డి కులబాంధవులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రెంటాల కేశవరెడ్డి, వాసుదేవ రెడ్డి, జనతా నరసింహారెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి



కలెక్టరేట్ ముట్టడిలో పాల్గొన్న నాయకులు

హన్మకొండ అర్బన్: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా సమ్మర్ క్యాంపుల పేరుతో విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ డిమాండ్ చేశారు. నిబంధనలు తుంగలో తొక్కి విచ్చలవిడిగా ఫీజుల వసూలు చేస్తున్న ఏకశిల విద్యాసంస్థలను మూసివేసి, చైర్మన్ తిరుపతిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడికి సోమవారం యత్నించారు. ఈక్రమంలో నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మంద నరేష్ మాట్లాడుతూ విద్యార్థుల నుంచి అక్రమంగా వసూలు చేసిన ఫీజులను ఏకశిల సంస్థ తిరిగి చెల్లించేవరకు తమ పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీఎస్‌ఎఫ్ కేయూ అధ్యక్షుడు మచ్చ పవన్, ఉపాధ్యక్షుడు మధుగౌడ్, ఆర్ట్స్ కళాశాల అధ్యక్షుడు శనిగరపు సుమంత్, నాయకులు ప్రశాంత్, ప్రకాష్, వెంకటేష్, సాయి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

మడికొండ: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేసిన సంఘటన మడికొండలో జరిగింది. కాజీపేట మండలం మడికొండ ఖండాల దాబా దగ్గర నివాసిస్తున్న నాంపెల్లి రంజిత్‌కుమార్(31) ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈక్రమంలో మృతుడి నేత్రాలను దానం చేయడానికి అతని తండ్రి శ్రీనివాస్, భార్య శారద ముందుకు వచ్చారు. అలువాల తేజస్వి సంఘమిత్ర యూత్ ఆర్గనైజేషన్ నర్సంపేట కోఆర్డినేటర్ అలువాల కిరణ్ సహకారంతో నేత్రదానం చేశారు.

తెలంగాణ జన వేదికను కొనసాగిద్దాం



సమావేశానికి హాజరైన జనవేదిక సభ్యులు

కాజీపేట అర్బన్: తక్కళ్లపల్లి రాము ప్రారంభించిన తెలంగాణ జన వేదికను తిరిగి కొనసాగించాలని తెలంగాణ జన వేదిక సభ్యులు అభిప్రాయపడ్డారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని మాజీ మంత్రి టీ.పురుషోత్తమరావు నివాసంలోని తెలంగాణ జన వేదిక కార్యాలయంలో సమావేశాన్ని సభ్యులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము ఆశయాలను ముందుకు తీసుకువెళ్దామని, ఆయన ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించిన సదస్సు కార్యక్రమాలకు తిరిగి రూపం తీసుకురావాలని నిర్ణయించారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు ఉదయ భానురావు, ఆకుతోట శ్రీనివాసులు, కొట్టి భాస్కర్, దేవేందర్‌రావు, కరుణాకర్‌రావు, కుమార్, పప్పి, క్రాంతికుమార్, పరమేశ్వర్, బజార్ రంగారావు, యాకోబ్, ఇస్మాయిల్, అమీర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ చెల్లింపు, సేఫ్టీపై అవగాహన



మాట్లాడుతున్న శ్యాంకుమార్

హసన్‌పర్తి: వయో వృద్ధుల సంక్షేమ సంస్థ విద్యారణ్యపురి, హెల్పేజ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో వయోవృద్ధుల సంక్షేమ సంస్థ అధ్యక్షుడు నర్సయ్య అధ్యక్షతన డిజిటల్ సేఫ్టీపై గోపాలపురంలోని ఎస్సార్ స్కూల్‌లో సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా హెల్పేజ్ ఇండియా కౌన్సిలర్ శ్యాంకుమార్ మాట్లాడుతూ ఆధునిక విధానం డిజిటల్ ట్రాన్స్‌ఫర్ సిస్టం ద్వారా ఆన్‌లైన్‌లో డబ్బులను చలామణి చేయవచ్చని వివరించారు. అలాగే, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ పేమెంట్ సిస్టానికి సంబంధించిన మెళకువలు నేర్పించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తేరాల యుగంధర్, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వీరన్న, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి విద్యాసాగర్, సభ్యులు కొండబత్తిని రాజేందర్, వేణు, సాంబయ్య, లింగయ్య, మలహాల్‌రావు, వెంగళ్‌రావు, అరుణాదేవి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

'ధర్మయుద్ధం'ను విజయవంతం చేయండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నిర్మాణ సంఘం నాయకులు

కాజీపేట: కార్మికుల సమస్యల పరిష్కారానికి చేపట్టిన ధర్మయుద్ధం బహిరంగ సభను విజయవంతం చేయాలని భవన నిర్మాణ సంఘం నాయకులు కోరారు. ఈమేరకు కాజీపేట అడ్డాపై కార్మికులకు స్వామి వివేకానంద భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సోమవారం కరపత్రాలు పంపిణీ చేశారు. బుధవారం జరగనున్న బహిరంగ సభకు కార్మికులందరు హాజరై విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో తేలు సారంగపాణి, పాలడుగుల శివకుమార్, ఇమ్మడి రాజు, జేరిపోతుల దేవేందర్, సాయికట్రాజ్, బాబు, సత్యం, ఎర్ర రాజు, ప్రేమ్‌కుమార్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.